విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శనివారం 10 మే 2025 8 పేజీలు

తాగు నీటి సమస్య రానివ్వొద్దు

- అధికారులు దృష్టి సారించాలి
- కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి ఏ. తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని గ్రీవెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ శ్రీమతి తమీమ్ అన్సారియా, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలతో, మునిసిపల్ కమీషనర్లతో సమావేశమై వేసవిలో త్రాగునీటి సరఫరా పై తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సమీక్షించి దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడా ప్రజలు త్రాగునీటికి ఇబ్బంది పడరాదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని, అందు కనుగుణంగా వేసవిలో సురక్షిత త్రాగునీటి సరఫరా పై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలో ఎక్కడా త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందించేందుకు రక్షిత త్రాగునీటి పథకాలలోని ఫిల్టర్ బెడ్స్ కు మరమ్మత్తులు చేయించాలన్నారు. అందుకవసరమైన నిధుల కోసం వెంటనే ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. బోర్ వెల్స్ పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని, అవసరమైన వాటికి మరమ్మత్తులు చేయించాలన్నారు. ఈ నెల 15వ తేదీ నుండి త్రాగునీటి అవసరాల కోసం నీటిని విడుదల చేస్తున్నందున, జిల్లాలోని అన్ని గ్రామాలలోని తాగునీటి వనరులను పూర్తిస్థాయిలో నింపుకోవాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా త్రాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఎప్పటికప్పుడు ఓవర్ హెడ్ ట్యాంకులను, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, పంచాయతీ రాజ్, మునిసిపల్ అధికారులను ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్, జిల్లా పరిషత్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల త్రాగునీటి అవసరాల కోసం ఒంగోలు జల్ శక్తి కేంద్రంలో 9618055155 టోల్ ఫ్రీ నెంబర్ ను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా టోల్ ఫ్రీ నెంబర్ అవగాహన కొరకు రూపొందించిన వాల్ స్టికర్ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకర రావు, డిపిఓ వెంకట నాయుడు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ముమ్మర తనిఖీలు

అర్ధరాత్రి నుండే జల్లెడ పట్టిన పోలీసులు

విశాలాంధ్ర-ఒంగోలు : శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ లక్ష్యంగా మరియు అంతర్గత భద్రత దృష్ట్యా జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రధాన రోడ్డు మార్గాలు, రద్దీ ప్రాంతాలు, ముఖ్య కూడళ్ళు, ప్రజలు ఎక్కువగా సంచరించే, నిరంతరం రద్దీగా ఉండే ప్రదేశాలలో పోలీస్ అధికారులు, సిబ్బంది, బీడీ టీమ్ మరియు డాగ్ స్క్వాడ్ సహాయంతో స్పెషల్ డ్రైవ్లో జిల్లా అంతటా విస్తృతంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, బార్డర్ చెక్పోస్టులు ఇలా అన్ని ముఖ్యమైన ప్రాంతాలలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అప్రమత్తంగా ఉంటూ తనిఖీలు నిర్వహించారు. ఏమైనా అనుమానస్పదంగా బ్యాగులు, వ్యక్తులు మరియు ఇతర వస్తువులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 సమాచారం అందించాలని పోలీస్ అధికారులు తెలియజేశారు. జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన కర్తవ్యమని, ప్రజల యొక్క భద్రత మరియు రక్షణ కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని, ఆకస్మిక తనిఖీల నిర్వహణ అనేది నేరాలను అదుపులో ఉంచడానికి, ప్రజలలో భద్రతా భావాన్ని పెంపొందించడానికి దోహదపడుతుందని తెలిపారు.

సూర్యలంక తీరంలో మాక్‌డ్రిల్

విశాలాంధ్ర - బాపట్ల : భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్మిన వేళ దేశంలో యుద్ధ సమయంలో వివిధ ప్రాంతాల్లో బాంబుల దాడి జరిగితే ఎలా వ్యవహించాలనే అంశాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఎక్కడికక్కడ మాక్ డ్రిల్స్ నిర్వహించి ప్రజలను జాగృతం చేస్తున్నాయి. బాపట్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, వైద్యఆరోగ్య శాఖల సమన్వయంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. సూర్యలంక తీరంలో శుక్రవారం కమాండర్ నోడల్ అధికారికగా బాపట్ల ఆర్డీవో గ్లోరియా నేతృత్వంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. బాంబ్ దాడి జరిగినప్పుడు నేలపై కూర్చుని చెవులు, కళ్లు మూసుకుని కూర్చోవాలని, ఛాతిని నేలపై పెట్టకుండా మోచేతులపై బెండ్ అవ్వాలని, భవనాలు, ఇతర ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని ఎలా బయటకు తీసుకువెళ్లాలో ప్రదర్శించారు. అడ్డు వచ్చిన వాటిని కట్ చేసుకుని లోపలికి ప్రవేశించే విధంగా కటింగ్ మిషన్, దాడి జరిగిన చోట, అగ్నిప్రమాదం జరిగిన చోట విక్టిమ్ లోకేటెడ్ కెమెరాతో లోపలి వారిని గుర్తించే ప్రక్రియ కూడా ప్రదర్శించారు. విషమస్థితిలో ఉంటే సీపీఆర్ ఎలా చేయాలో వైద్యసిబ్బంది ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పో విలియమ్స్, బాపట్ల తహశీల్దారు సలీమా తదితరులున్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం

మంత్రి గొట్టిపాటిచే సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - అద్దంకి : నియోజకవర్గంలోని 33 మంది లబ్దిదారులకు రూ. 34.77 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి గొట్టిపాటి రవి కుమార్ శుక్రవారం చిలకలూరి పేటలోని తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేద ప్రజల పాలిట కూటమి ప్రభుత్వం ఆపన్న హస్తంగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూనే .. మరో పక్క హార్ట్, కేన్సర్, కిడ్నీ వంటి ప్రాణాంతక వ్యాధులతో బాధపడే నిరుపేద రోగులకు వైద్య ఖర్చుల భారం పడకుండా సకాలంలో సీఎంఆర్ఎఫ్ ఫండ్ కింద నిధులు విడుదల చేస్తోందని తెలిపారు. అంతే కాకుండా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ఆపరేషన్ల నిమిత్తం సమయానికి ఎల్ఓసీలు అందజేస్తూ వారి ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని, ప్రజల కష్టాల్లో అండగా నిలిచే నిజమైన మానవీయ ప్రభుత్వమని పేర్కొన్నారు. అనంతరం అద్దంకి పరిధిలో జరిగే బీటీ రోడ్ల నిర్మాణ పనులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. నియోజకవర్గ పరిధిలో జరిగే రోడ్ల నిర్మాణం, నాణ్యత విషయంలో అధికారుల పర్యవేక్షణ తప్పక ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా పనులు జరుగుతున్న తీరు, నాణ్యతపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు. అధికారులు రోడ్ల నాణ్యత పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దమ్ము చక్రాల వాహనాల వలన రోడ్లు ధ్వంసం అవుతున్నాయని అన్నారు. ఈ విషయంలో సంబంధిత ప్రాంత ప్రజలే బాధ్యతగా తీసుకుని వాహనాల రాకపోకలను కట్టడి చేయాలని కోరారు. తమ ప్రాంత రోడ్లు బాగుండాలంటే దమ్ము చక్రాల వాహనాలను రోడ్లపైకి అనుమతించకుండా అధికారులతో పాటు స్థానికులు చూడాలన్నారు. అదే విధంగా పంచాయితీరాజ్ రోడ్ల నిర్మాణాలకు సంబంధించి సుమారు రూ.24 కోట్లతో అంచనాలు రూపొందించి నిధుల కోసం సంబంధిత శాఖకు పంపామని మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. రాబోయే రోజుల్లో అన్ని ప్రాంతాల్లోనూ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టి ప్రజలకు పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

20న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి

ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు సింగం వాణిశ్రీ

విశాలాంధ్ర - బాపట్ల : ఈనెల 20వ తేదీ భారతదేశ వ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు, అంగన్‌వాడీ జిల్లా కన్వీనర్ సింగం వాణిశ్రీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడమటి బిక్షాలు తెలిపారు. ఈ నెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం రేపల్లెలో సన్నాహక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరు కానున్నారని హాజరుకానున్నారని తెలిపారు. మనమంతా ఐక్యంగా కార్మిక చట్టాలను కాపాడుకుందామని వారు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల అవలంభిస్తున్న వ్యతిరేఖ విధానాలను తిప్పికొట్టాల్సిన అవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కోన శ్రీను తదితరులున్నారు.

భూముల రీసర్వేకు నమోదు చేసుకోవాలి

తహసీల్దార్ సింగారావు

విశాలాంధ్ర - జెవంగులూరు : ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేలో భాగంగా ఫేజ్-2లో మండలంలోని కొండమూరు రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేయటం జరిగిందని తహశీల్దారు సింగారావు తెలిపారు. కొండమూరు రెవెన్యూ పరిధిలో భూములు ఉన్న రైతులు ఈనెల 12వ తేదీ లోపు ముటేషన్ నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. భూమిగల యజమానులు చనిపోయి ఉండి ఆ భూమిని వారి వారసుల పేరు మీదకు రెవెన్యూ రికార్డులలో మార్చుకునే వారు, భూమి కొనుగోలు చేసి ఉండి వారి పేరు మీద ఆ భూమిని రెవెన్యూ రికార్డులలో మార్పు చేసుకోవలసినవారు, భూమి సాగు హక్కుదారుగా ఉండి ఆ భూమిని తన పేరు మీద రెవెన్యూ రికార్డులలో నమోదు కానివారు, ఇతరుల క్రింద ఉండి రెవిన్యూ రికార్డులలో నమోదు కాని భూమికి ఆయా రైతులు ముంటేషన్ నమోదు చేయించు కోవాల లన్నారు. కొండమూరు రెవెన్యూ పరిధిలోని రేణింగవరం, ముప్పవరం, జనకవరం, బయట మంజులూరు, అలవలపాడు, కోటపాడు గ్రామాలలోని రైతులు ఈనెల 10, 11 తేదీలు శని, ఆదివారాలలో ఆయా గ్రామ సచి వాలయాలలో భూములకు సంబంధించి ముడిటేషన్ నమోదు చేసుకోవాలని తెలిపారు.

జర్నలిస్టులు నిరసన

విశాలాంధ్ర - అద్దంకి : ఓ పత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీసులు అక్రమంగా చొరబడి సోదాలు చేయడానికి నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇంట్లోకి చొరబడి సోదాలు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. అనంతరం కార్యాలయ డిప్యూటీ తాసిల్దార్ సురేష్ కు వినతి పత్రం అందజేశారు.

నేడు దద్దాల జన్మదిన వేడుకలు

వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని

విశాలాంధ్ర-పామూరు రూరల్ : కనిగిరి వైసీపీ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ 43వ జన్మదిన వేడుకలను శనివారం ఉదయం 10 గంటలకు మండల వైసిపి కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి తెలిపారు.

నేరస్థులకు శిక్ష పడాలంటే సాక్షాధారాలు కీలకం

ఎస్పీ తుషార్‌డూడి

విశాలాంధ్ర - బాపట్ల : నేరస్తులకు శిక్ష పడాలంటే సాక్షాధారాలు అత్యంత కీలకమని శాస్త్రీయ పద్ధతులలో భౌతిక సాక్షాధారాలు సేకరణలో నైపుణ్యత పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులకు తెలిపారు. ఫోరెన్సిక్ నిపుణుల ఆధ్వర్యంలో జిల్లాలో పని చేస్తున్న దర్యాప్తు అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ఎస్పీ క్యాంప్ కార్యాలయ సమావేశ హాలులో నిర్వహించారు. ఎస్పీ కేసు దర్యాప్తులో భౌతిక ఆధారాల ప్రాముఖ్యత గురించి వివరించారు.నేర స్థలం నుండి రక్త నమూనాలను, సెమన్, వెంట్రుకలు, ఉమ్మి, పాదముద్రలు, వేలిముద్రలు సేకరించడం, మత్తు పదార్థాలు, మానవ అవయవాలు, విష పదార్థాలు, సైబరు నేరాలకు సంబంధించిన కేసుల్లో ఆడియోలు, వీడియోలను, మెమరీ కార్డులు, హార్డ్ డిస్క్‌లను ఏవిధంగా సేకరించి భద్రపరచాలి. ఫోరెన్సిక్ నిపుణుల పరిశీలనకు పంపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర విషయాలను శిక్షణ కార్యక్రమంలో దర్యాప్తు అధికారులకు ఫోరెన్సిక్ నిపుణులు వివరించారు. అదే విధంగా ఫోరెన్సిక్ పరీక్షల్లో నేరం నిరూపించేందుకు అవసరమైన స్పష్టమైన ప్రశ్నలతో లెటర్ ఆఫ్ అడ్వైజ్ ఏవిధంగా తయారు చేసి పంపాలో ఫోరెన్సిక్ నిపుణులు దర్యాప్తు అధికారులకు విపులంగా వివరించారు. జిల్లాలో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులకు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులకు ఫోరెన్సిక్ నిపుణులతో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఫోరెన్సిక్ సైన్స్ నందు గల అన్ని విభాగాలకు సంబంధించిన నిష్ణాతులైన వారితో ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీస్ స్టేషన్‌లలో నమోదవుతున్న కేసుల్లోని నిందితులు శిక్షింపబడాలంటే నేర స్థలం నుండి భౌతిక సాక్షాధారాలను సక్రమ పద్ధతిలో సేకరించడం కీలకమన్నారు. ఆధారాలను సేకరించడంలో ఆధునిక శాస్త్రీయ, సాంకేతిక పద్ధతులను అవలంభించాలని అధికారులకు తెలిపారు. భౌతిక ఆధారాలను ప్యాకింగు చేయడం, పరీక్షల కొరకు సకాలంలో ఫోరెన్సిక్ ల్యాబ్ లకు పంపడం చాలా ముఖ్యమన్నారు. ఈ వర్కుషాపులో ఫోరెన్సిక్ నిపుణులు తెలియజేసిన మెళకువలను కేసుల దర్యాప్తులో వినియోగించి, న్యాయ స్థానాల్లో నిందితులు శిక్షింపబడే విధంగా కేసులను దర్యాప్తు నిర్వహించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నేరానికి పాల్పడిన ప్రతీ నిందితుడికి న్యాయస్థానంలో శిక్షలు పడినప్పుడే నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. అదనపు ఎస్పీ టి.పి. విఠలేశ్వర్, బాపట్ల, చీరాల, రేపల్లె డీఎస్పీ లు రామాంజనేయులు, మోయిన్, శ్రీనివాసరావు, సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, ఏఆర్ డీఎస్పీ విజయసారధి, మంగళగిరి ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నిపుణులు, జిల్లాలోని ప్రభుత్వ వైద్యులు, సంబంధిత కోర్టు పిపి, ఎపిపి లు, జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సిఐలు, ఎస్ఐలు, పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సంకల్పిద్దాం

విశాలాంధ్ర - సంతమాగులూరు : యుక్త వయస్సు దాటకుండా బాల్య వివాహాలు చేయడం వలన అనేక దుష్ప్రభావాలు ఎదుర్కోవాల్సి వస్తుందని సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్ వైజర్ జి.ప్రమీల అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతులను శుక్రవారం ఏల్చూరులోని ఎస్సీ-2 అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈసందర్భంగా ప్రమీల మాట్లాడుతూ.. ఆడపిల్లలకు చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం ద్వారా అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని చెప్పారు. అదేవిధంగా వారిలో స్వతహాగా ఆలోచించి నిర్ణయం తీసుకునే పరిపక్వత ఉండదని తెలిపారు. అంతేకాకుండా మెట్టినింట కుటుంబ వ్యవస్థలో ఇమడలేక గొడవలకు దారితీసే పరిస్థితి నెలకొందన్నారు. నేడు దేశం మొత్తం భారత్-పాక్ మధ్య జరుగుతున్న వార్‌లో ఇద్దరు మహిళలు ఆపరేషన్ సింధూర్ నాయకత్వం వహించారన్నారు. వారి తెగువ, ప్రేరణ మహిళలకు ఆదర్శం. అన్ని రంగాల్లో మహిళలు తమ సత్తా చాటుతున్నారన్నారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న ఆడపిల్లలను బాల్య వివాహాల పేరుతో బలిచేయకండని హితవు పలికారు. ఎక్కడైనా వివాహాలు చేస్తున్నట్లు సమాచారం అందితే వెంటనే అంగన్వాడీ, ఆశా, మహిళా పోలీసులతో వెళ్లి ఆడపిల్లల తల్లితండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలిద్దాం అని అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, చిన్నారులతో కలిసి సూపర్ వైజర్ ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్కేమస్తాన్ బి, షాకిరూన్, చిన్నమ్మ, పీవీ దుర్గా, వై.ఇందిర, ఆర్.తిరుమల, సీహెచ్.బసవమ్మ, ఎ.అపర్ణ, ఎస్కే మస్తాన్ బి, డి.బోడెమ్మ, మహిళా పోలీసులు అమీన్, సుమన, మహాలక్ష్మి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు వద్దు

విశాలాంధ్ర - వేటపాలెం : 18 సంవత్సరాల లోపువివాహం చేసుకుంటే బాలికలు ఎన్నో సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ సజ్జా పుష్పవల్లి తెలిపారు. వేటపాలెం సెక్టార్ లోని రావూరిపేట వన్ అంగనవాడి కేంద్రంలో కిషోరివికాసం వేసవి శిక్షణ శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాల నిండని బాలికలు వివాహం చేసుకుంటే పుట్టే బిడ్డలకు , తల్లులకు ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని వివరించారు. రుతుక్రమం క్రమం తప్పకుండా రావాలంటే బాలికలు పౌష్టికాహారాన్ని వ్యాయామని తప్పనిసరిగా చేయాలని అన్నారు. ఈ సందర్భంగా బాలికల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ కల్పన, అంగనవాడి కార్యకర్తలు ఎస్ సరళ, భ్రమరాంబ, రమాదేవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీచింగ్ లెర్నింగ్ కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - అద్దంకి : స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక అవసరాలు గల ముగ్గురు విద్యార్థులకు టీచింగ్ లెర్నింగ్ కిట్లను పంపిణీ చేశారు. సమగ్ర శిక్ష బాపట్ల జిల్లా ద్వారా మంజూరైన ప్రత్యేక బోధన సామాగ్రిని అందజేశారు. బడి వరకు నడవలేని బుద్ధి మాంద్యత వలన ఇంటి వద్దనే విద్య పొందుతున్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కింద పాలెం కు చెందిన విద్యార్థి జడ సందీప్, ఎంపీపీ పాఠశాల ధర్మవరం విద్యార్థిని జనరాజు పల్లి మేరీ పుష్ప, ఎంపీపీ పాఠశాల అద్దంకి ఎన్టీఆర్ నగర్కు చెందిన కొండా వెంకట గోపిచంద్ లకు ప్రత్యేక బోధనోపకరణముల కిట్లను పంపిణీ చేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ఒక్కొక్క కిట్టు విలువ 15 వేల రూపాయలు ఉంటుందని, వీటిని సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ బోధ నోపకరణముల తో వీరికి ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వీరి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్నాథం బాబురావు, కందుల గంగాధర్, సిఆర్పి రామకృష్ణ, కొంగల శ్రీను విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బర్లీ పొగాకు కొనుగోలు చేయాలి

- ప్రభుత్వమే రూ.100 కోట్లు కేటాయించాలి
- రైతు కౌలు రైతు సంఘాల డిమాండ్

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : బర్లీ పొగాకును కొనుగోలు చేయాలని కోరుతూ రైతు కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం మండలకేంద్రమైన నాగులుప్పలపాడు బస్టాండ్ సెంటరులో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శుల జె జయంతిబాబు, పమిడి వెంకట్రావులు మాట్లాడుతూ అనేక ప్రయివేట్ కంపెనీలు రైతులను ప్రోత్సహించి బర్లీ పొగాకు సాగుచేయించారు. ఎంతైన కొనుగోలు చేస్తామని నమ్మబలికారు తీరా పంట చేతికి వచ్చిన తరువాత కుంటి సాకులు చెబుతూ ఒక్కక్వింటా కూడ కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. దాంతో రైతాంగం పండించిన పంటను నిల్వచేసుకోవడానికి వసతులు లేక పల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు ప్రభుత్వం కూడ రైతులను ప్రోత్సహించి కంపెనీల చేత కొనుగోలు చేయించుతంతో విఫలమైందమన్నారు ఒక ప్రక్క రైతులు అధైర్యపడవద్దు పండిన పంట అంతా కొనుగోలు చేయిస్తామని రైతుల కంటనీరు తుడిచే విదంగా మాట్లాడుతున్నారే తప్పా కేంద్రప్రభుత్వంపై వత్తిడి తెచ్చి బర్లీ పొగాకు రైతుల సమస్యలను పరిష్కరించడంతో ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు ఇప్పటికైన ప్రభుత్వం పునరాలోచించి 100 కోట్లు కేటాయించి రైతుల వద్ద ఉన్న బర్లీ పొగాకు మొత్తం కొనగోలు చేయాలని డిమాండ్ చేసారు లేనిచో బర్లీ పొగాకు రైతులందరిని ఐక్యం చేసి త్వరలో కలెక్టర కార్యాలయం పెద్ద ఎత్తున ఉద్యమం చెపట్టాతామని హెచ్చరించారు ఆకార్యక్రమంలో బర్లీ పొగాకు రైతులందరు పాల్గొనాలని అప్పుడే సమస్య పరిష్కారమవుతుందని పిలుపనిచ్చారు ఈ కార్యక్రమంలో కౌలరైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి టి శ్రీకాంత్ , జి బసవ పున్నయ్య, కాకాని సుబ్బారావు, పాలపర్తి యోనా, హజరత్తయ్య,మండవ ఆంజనేయులు, వివిద గ్రామాల బర్లీపొగాకు రైతులు పాల్గొన్నారు.

విజ్ఞానభాండాగారాలు గ్రంథాలయాలు

విశాలాంధ్ర-గిద్దలూరు : విజ్ఞానభాండాగారాలు గ్రంథాలయాలని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ మొర్రి పిచ్చయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం నగర పంచాయతీ పరిధిలోని శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులను సందర్శించడానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం వలన విద్యార్థుల మేధస్సుకు చక్కగా దోహద పడతాయి. వేసవి సెలవుల్లో విద్యార్థులుసమ యాన్ని వృధాచేసు కోకుండా గ్రంథాల యావెళ్ళి సమయాన్ని సద్వినియోగం చేసుకుని వేసవి శిక్షణ తరగతులలో హాజరై క్యారం బోర్డ్ చెస్ నీతి కథలు డ్రాయింగ్ జనరల్ నాలెడ్జ్ కోష్చన్స్ యోగా ధ్యానం నేర్పించ టం దిన పత్రికలు చద వటం చదివించటం దేశ స్వాతంత్రం కోసం పోరాటం చేసిన నాయ కుల పేర్లను తెలియ చేయటం నైతిక విలువల గురించి చెప్పటం జరుగును. ప్రతి రోజూ ఉదయం 8:00గంటల నుంచి 11: 00 గంటలఊ వరకు వేసవి శిక్షణ తరగ తులు జరుగును. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకూరాలు యాన్. ప్రసన్న కుమారి, విశ్రాంత ప్రధానోఉపా ధ్యాయులు బి.రామి రెడ్డి, పారా లీగల్ వాలంటరీ మధు సుధన్ రావు, ఉపాధ్యాయులు జేయం శివ ప్రసాద్. యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఫరూఖ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

విశాలాంధ్ర – కనిగిరి: మండల పరిధిలోని చాకిరాల గ్రామంలో ఏఎన్ఎం సౌజన్య, అంగన్వాడి టీచర్ దీపిక ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు బాల్య వివాహాల వలన కలిగే నష్టాలు, ప్రమాదాలు బాల్య వివాహాలు నివారించటానికి ఉన్న చట్టాలపై అవగాహన అలాగే పునరుత్పత్తి సమయంలో ఆరోగ్య సమస్యలు తీసుకోవలసిన జాగ్రత్తలు, రుతుక్రమంలో వచ్చే మార్పులపై, శుభ్రత, అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాలపై బాలికలకు అవగాహన కల్పించి శిశు మరణ రేటును తగ్గించాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాలికలు, మహిళలు, ఆశా వర్కర్ నాగరత్నమ్మ, పాల్గొన్నారు.

ఒంగోలు ధర్నాకు తరలిన ఏపీటీఎఫ్ నాయకులు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1 నుండి 5 తరగతులు ఉండే విధంగా మోడల్ ప్రాథమిక పాఠశాలలు లేదా బేసిక్ ప్రైమరీ స్కూల్స్ మాత్రమే ఉండాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను కొనసాగించాలని, సియస్ పురం మండలంలోని అన్ని యూపీ స్కూల్స్ కొనసాగించాలని, 1 నుండి 5 తరగతులు హై స్కూల్‌కు అనుసంధానం చేసే విధానం విరమించుకోవాలనే తదితర డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగిన ధర్నా కార్యక్రమంలో సి యస్ పురం మండలం ఏపీటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు విరివిగా పాల్గొని విజయవంతం చేసినట్లు ఏపీటీఎఫ్ సి ఎస్ పురం మండల శాఖ అధ్యక్షులు తోట శ్రీనివాసులు జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్ తెలిపారు. ధర్నా కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ అర్హత కలిగిన అన్ని యూపీ స్కూల్స్ కొనసాగించాలని, ఉన్నత పాఠశాలలో 45 మంది దాటినచోట రెండవ సెక్షన్, ఆపై ప్రతి 35 మందికి అదనపు సెక్షన్లు ఏర్పాటు చేయాలని , ప్రతి ప్రాథమిక పాఠశాల కు 2 ఎస్ జి టి పోస్టులు మంజూరు చేయాలని, పెండింగ్ లో ఉన్న 3 డి ఎ లు విడుదల చేయాలని, 12 వ పి ఆర్ సి ప్రకటన విడుదల చేయాలని, 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలని, 11 వ పి ఆర్ సి ఆర్థిక బకాయిలు విడుదల చేయాలనీ, సి పి ఎస్ విధానాన్ని రద్దు చేయాలని, తెలుగు మీడియం కొనసాగించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో సి యస్ పురం నాయకులు జి మల్లికార్జున రాజు, బి శివ ప్రసాద చారి, జి సుప్రజ, ఐ శిరీష, డి సుబ్బరాయుడు, పి ఏడుకొండలు, గాలి రవీంద్ర, జి హరిబాబు, కె చెన్నయ్య, బి చిన్న నారాయణ, యన్ గంగాధర్, జి లక్ష్మణ్ కుమార్, బి శ్రీనివాసులు, యస్ యం షరీఫ్, టీ రమేష్, సయ్యద్ ఖాజా రహంతుల్లా, పెంచల నరసయ్య, పి ఓలేశ్వర రావు, యన్ వెంకటరావు , షేక్ మాలిక్, కె బాల కోటయ్య పాల్గొని విజయవంతం చేశారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి

విశాలాంధ్ర-కొనకనమిట్ల : రైతులు తమ భూముల్లోని మట్టి నమూనాలను సేకరించి ఆ మట్టి నమూనాలను భూసార పరీక్షా కేంద్రానికి పంపాలని మండల వ్యవసాయ అధికారి కె.ప్రసన్న రంగ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ భూముల్లోని సేకరించి మట్టి నమూనాలను రైతు సేవ కేంద్రాల సిబ్బందికి అందజేసినట్లయితే వారు ఆ మట్టి నమూనాలను భూసార పరీక్ష కేంద్రా నికి పంపడం జరుగుతుందన్నారు. భూసార పరీక్షల ఫలితాలను బట్టి రైతులకు సూక్ష్మ పోషకాలను ప్రభుత్వము రాయితీపై అందజేయడం జరుగుతుందన్నారు. మండలంలో 990 మంది రైతుల భూముల్లోని మట్టి నమూనాలను సేకరించాల్సిన లక్ష్యంగా చేసిందన్నారు .భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు వాడకం ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి అన్నారు. రైతులు సేకరించిన మట్టి నమూనాలను ఈనెల 15వ తేదీ లోపల పంపాల్సి ఉంటుందన్నారు.

నేడే భోగనంపాడు అంకమ్మ తల్లి తిరునాళ్ల

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని భోగనం పాడులో శనివారం శ్రీ అంకమ్మ తల్లి తిరునాళ్లు ఘనంగా నిర్వహిస్తున్నట్లు భోగనంపాడు టిడిపి నాయకుడు పొన్నగంటి సుబ్బారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11వ తేదీన పొంగళ్ళు కార్యక్రమం ఉంటుందని కావున మండలంలోని భక్తులు ప్రజల పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లుగా మండల విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కొమరోలులోని 33 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లుగా తెలిపారు. కావున ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

విశ్వేశ్వరస్వామి దేవస్థానానికి కదిరి బాబురావు రూ.4 లక్షలు విరాళం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : సిఎస్ పురం మండలంలోని రేగులచెలక పంచాయతీలోని గణేశునిపల్లి గ్రామంలో నూతనంగా శ్రీ ఇష్ట కామాక్షి సమేత విశ్వేశ్వర స్వామి దేవస్థానం నిర్మిస్తున్నారు. ఈ దేవస్థానం నిర్మాణానికి కనిగిరి మాజీ ఎమ్మెల్యే వైసీపీ విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు 4 లక్షలు (నాలుగు లక్షల రూపాయలు) విరాళం ఇచ్చారు. ఈ విరాళాన్ని కదిరి బాబురావు సోదరుడు కదిరి పార్థసారథి శుక్రవారం దేవస్థానం కమిటీ సభ్యులు కుక్కా తిరుపతయ్య, సాదు వెంకటేశ్వర్లు,రామస్వామి కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామస్వామి, మాజీ ఎంపిటిసి లు మునగల నారాయణ రెడ్డి, మూరం కాశిరెడ్డి,తికణం బాబురావు,పులి శేఖర్ రెడ్డి, మాల్యాద్రి రెడ్డి ,వెంకటనారాయణ రెడ్డి ,పట్నం తిరుపతయ్య,సున్నా నారాయణ,నరేష్, తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసి బస్సు

విశాలాంధ్ర-మార్కాపురం : తెలంగాణ రాష్ట్రంలోని కోరుట్ల నుంచి పామూరు వెళ్తున్న తెలంగాణ ఆర్టీసి సర్వీసు బస్సు శుక్రవారం ఉదయం మార్కాపురం పట్టణ శివార్లలో అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టింది. అయితే బస్సులో ప్రయాణీకులకు ఎటువంటి ఇబ్బంది లేకపోయినా. బస్సు ఫుట్‌బోర్డు భాగం దెబ్బతిన్నది. మార్కాపురం టౌన్లోనికి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణీకులను మరోబస్సులో గమ్యస్థానాలకు పంపారు. డ్రైవరు నిద్రమత్తా..! నిర్లక్ష్యమా..! అనేది తెలియాల్సి ఉంది. ఇంకొక అడుగు ముందుకు వెళ్లివుంటే బస్సులో ముందు కూర్చున్న ప్రయాణీకులకు గాయాలు అయివుండేవి.

సామాన్య ఖాతాదారులకు మెరుగైన సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - తాళ్లూరు : సామాన్య ఖాతాదారులకు మెరుగైన సేవలను కెనరా బ్యాంకు మెనేజర్ ధర్మసాయి అందించి అందరి మన్ననలు పొందారని వక్తలు అన్నారు. కెనరా బ్యాంకులో శుక్రవారం బదిలీపై వెళు న్న పి.ధర్మసాయి ఖాతాదారులు పలువురు ప్రముఖులు ఘనంగా సన్మానించారు. కేక్కు కట్ చేయించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. వెంకటరావు ఏడుకొండలు, కైపు కోటి రెడ్డి, పాలెం కోటి రెడ్డి, వెంకట నారాయణ, శ్రీనివాస రెడ్డి, ఓబులు రెడ్డి పలువురు ప్రముఖులు పాల్గొన్ని ఘనంగా సన్మానించారు.

డీఎస్సీ విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

విశాలాంధ్ర - ఒంగోలు టౌన్: డీఎస్సీ -2025 పరీక్షలకు హాజరు అవుతున్న విద్యార్థులకు ఆంధ్ర ప్రదేశ్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత ఆన్ లైన్ శిక్షణ ఇస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఎం.అంజల తెలిపారు. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈ డబ్యు ఎస్ (ఈబీసీ) అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు విద్యార్హత, టెట్ మార్కులు, కుల ధృవీకరణ, ఆదాయ, ఆదార్ జెరాక్స్ కాఫీలతో పాటు రెండు ఫోటోలను ఎపీ బీసీ స్టడీ సర్కిల్, ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఎదురు (పాత రిమ్స్)లో అందజేయ్యాలని కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 08592-231232, 9989285530, 8985090926లను సంప్రదించాలని వివరించారు.

భారతీయ ఆర్మీకి ప్రజలందరూ మద్దతునిద్దాం

గుండారపు ఈశ్వర్

విశాలాంధ్ర-పుల్లలచెరువు : భారత ఆర్మీ సైనికులకు ప్రతి ఒక్కరు మద్దతు ఇవ్వాలని ప్రకాశం జిల్లా బిజెపి కార్యదర్శి జి.ఈశ్వర్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిజెపి రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం, ప్రకాశం జిల్లా అధ్యక్షులు సెగ్గం శ్రీనివాస్ యొక్క ఆదేశాలను సారం గత నెల 22వ తేదీ జమ్మూ కాశ్మీర్ లోని అనంతనాగ్ జిల్లా పహల్గాంలో హిందువులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్పులలో మరణించిన మన భరతమాత ముద్దుబిడ్డలు పై జరిగిన ఉగ్రదాడి ప్రతీకారంగా ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరియు మన దేశ ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ సారధ్యంలో పాకిస్తాన్లోని ఉగ్రవాద స్థావరాలపై విరోచిత దాడులు చేసి వందమంది ఉగ్రవాదులు మట్టు పెట్టడం జరిగింది. ఇందుకుగాను మన ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ బలగాలకు మరియు మన దేశ రక్షణ వ్యవస్థకు మద్దతుగా జిల్లాలోని అన్ని మండలాల్లో దేవాలయాల్లో మన ఆర్మీకి మరియు రక్షణ వ్యవస్థకి పూజలు నిర్వహించాలని కోరుచున్నాము అని ఈ కార్యక్రమం ను జిల్లా బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఈశ్వర్ కోరారు.

సచివాలయం ఎమ్మార్వో తనిఖీ

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండలంలోని చాపలమడుగు సచివాలయం శుక్రవారం తహసీల్దార్ కే.వెంకటేశ్వర్ రావు రేషన్ కార్డు పునరుద్ధీకరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రభుత్వం నూతన రేషన్ కార్డు దరఖాస్తుల ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని సిబ్బందికి సూచన చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందేలా చూడాల్సిన బాధ్యత అన్నారు. చేర్పులు మార్పులు నూతన రేషన్ కార్డులను మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అని తెలియజేశారు.

సాగర బ్రిడ్జిని పరిశీలించిన మంత్రి జనార్ధన్

విశాలాంధ్ర-త్రిపురాంతకం :

త్రిపురాంతకం మండలంలోని వైపాలెం రోడ్‌లో సాగర ప్రధాన కాల్వపై వున్నా బ్రిడ్జిని రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ శుక్రవారం పరిలీలించారు. ఇటీవల కాలంలో వై పాలెం ఇంచార్జి గూడూరి ఏరిక్షన్ బాబు బ్రిడ్జి విషయం మంత్రిని కలసి వివరించారు. కుంట వైపు నుండి విజయవాడ వెళ్తు మార్గం మధ్యలో వున్నా సాగర్ కాల్వా బ్రిడ్జిని పరిశీలించారు. అక్కడే వున్నా తెలుగుదేశం పార్టీ నియోజక వర్గ ఇంచార్జి గూడూరి ఏరిక్షన్ బాబు, స్థానిక నాయకులని బ్రిడ్జి విషయాలు అడిగి తెలుసుకున్నారు.మంత్రికి శివాలయం, అమ్మవారి విశిష్టతను, పండుగల సమయంలో భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి జనార్ధన్ త్వరలోనే శంకుస్థాపన చేస్తానని హామీ ఇచ్చారు. సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అయన వెంట మండల పార్టీ కన్వీన్నర్ వలరాజు, మాజీ కన్వీనర్ మోట్లకట్ల శ్రీనివాసరెడ్డి, నీటిసంఘం డి సి సి దేవినేని చలమయ్య,తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు వున్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

విశాలాంధ్ర - బేస్తవారిపేట : రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీ నాయక్ అన్నారు. మండలంలోని జేబీకే పురం, చెట్టిచెర్ల రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం భూసార పరీక్షలు, అన్నదాత సుఖీభవ, పచ్చిరొట్ట పైర్లపై రైతులకు నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ 2025 - 26 సంవత్సరానికి గాను భూసార పరీక్షలు చేయించుకొనుటకు రైతు సేవ కేంద్రాల వారిగా టార్గెట్లు ఇవ్వటం జరిగిందని, ఈ భూసార పరీక్ష కోసం మట్టి నమూనాల సేకరణ ఈనెల చివరినాటికి పూర్తిచేయాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో భూములు నిస్సారంగా ఉన్నయని, వాటిని సారవంతం చేయుటకు తగినంత పశువుల ఎరువు అందుబాటులో లేని కారణంగా రైతులు పచ్చిరొట్ట పైరైన జనుము జీలుగా పిల్లి పెసర విత్తనాలను ఎండాకాలంలో వర్షం పడిన వెంటనే భూమిలో చల్లుకొని ఆ పైర్లను 45 రోజుల దశలో భూమిలో కలియదున్నడం వల్ల భూములు సారవంతంగా మారుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ, సర్పంచ్ కృష్ణారెడ్డి, ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో ఉత్తమ యాజమాన్య పద్ధతులు సాధ్యం

విశాలాంధ్ర - తాళ్లూరు : భూసార పరీక్షలతో నేలల స్వభావం తెలుసుకుని అవసరమైన మేర నేల బలానికి మందులు వాడుకుని ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించి మేలైన దిగుబడులు పొందవచ్చని ఎంపీపీ తాటికొండ శ్రీనివాస రావు అన్నారు. మాధవరం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులకు భూసార పత్రాలను పంపిణీ చేసారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించి ఫలితాలు త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బంగారు నేల- బంగారు పంట పథకంలో మండలంలో 580 శాంపిల్స్ తీసినట్లు వ్యవసాయాధికారి

ప్రసాద రావు తెలిపారు. ప్రతి సంవత్సరం కొన్ని కొత్త క్షేత్రాలలో శాంపిల్స్ తీస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఫలితాల కార్డు ఉంటే రాయితీపై సూక్ష్మ పోషకాలు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అల్లం వెంకటేశ్వర్లు, విఆర్ఓ బపాల్గొన్నా డి.ఎ భార్గవ్, వీఏఏ సీహెచ్ సుధీర్ రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పాఠశాల సంసిద్ధత ఉత్సవం

విశాలాంధ్ర-పుల్లలచెరువు :

మండలంలోని పుల్లలచెరువు సెక్టార్‌లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో పాఠశాల సంసిద్ధత ఉత్సవాన్ని మండల తహసీల్దార్ కె వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ సూపర్వైజర్ నర్రా.శివలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన వీధిలో ర్యాలీ నిర్వహించి తల్లిదండ్రులు, గ్రామస్తులందరికీ ఆహ్వాన పత్రికల ద్వారా కార్యక్రమానికి ఆహ్వానం అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ పాఠశాల సంసిద్ధ ఉత్సవంలో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసిన పిల్లలు తమ తల్లిదండ్రుల సమక్షంలో "రిజిస్ట్రేషన్ స్టాల్" వద్ద నమోదు చేసుకోవాలని అన్నారు. అనంతరం "సమగ్ర అభివృద్ధి స్టాల్" వద్ద వారి అభ్యసన నైపుణ్యాలను పరిశీలించి, "కౌన్సిలింగ్ స్టాల్" ద్వారా తల్లిదండ్రులకు వారి పిల్లల బలాలు, మెరుగుపరచవలసిన అంశాలపై సవివరంగా వివరణ ఇచ్చారు. జిల్లా ఐటీసీ ప్రథమ్ కోఆర్డినేటర్ ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ పిల్లలు జూన్ 12న ప్రథమ తరగతిలో చేరేలోపు ఎటువంటి అభ్యాసంపై దృష్టి పెట్టాలి అన్న విషయాన్ని తల్లిదండ్రులకు స్పష్టంగా తెలియజేశారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన చిన్నారులందరికీ "గ్రాడ్యుయేషన్ డే" నిర్వహించి, వారిని సర్టిఫికెట్లతో సత్కరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల అభివృద్ధిని ప్రత్యక్షంగా గమనించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లలచెరువు మండల తహసీల్దార్ కె.వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్వైజర్, నర్రా శివలక్ష్మి, జిల్లా ఐటీసీ ప్రథమ్ కోఆర్డినేటర్ ఎస్.వెంకట్రావు, వి.వసుంధర దేవీ, వీఆర్వో వసుంధర దేవీ ,జిల్లా ఐటీసీ ప్రథమ్ కోఆర్డినేటర్ ఎస్. వెంకట్రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, బేబీ రాణి నాగ కుమారి, తల్లులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి జయంతికి తరలిరండి

విశాలాంధ్ర-వెలిగండ్ల: మండలంలోని వెలిగండ్ల గ్రామంలో వెలసి ఉన్నటువంటి శ్రీశ్రీశ్రీ స్తంభోద్భవ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం నందు ఈనెల 11 వ తేదీన ఆదివారం రోజు జరుగుచున్నటువంటి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జయంతి అంగరంగ వైభవంగా జరుగుచున్నది. ఈ సందర్భంగా ఉదయం ఏడు గంటలకు గణపతి పూజ, స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నది. మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాదములు అందించడం జరుగుచున్నది. కావున భక్త మహాశయులందరూ అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామివారి కృపాకటాక్షములకు పాత్రులు కావాల్సిందిగా కోరుచున్నాము అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద రాత్రి 8 గంటలకు వెలిగండ్ల గ్రామంలో శ్రీ కోదండ రామా భక్త బృందం వారిచే కోలాటం ఉండునని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆలయ కమిటీ వారు తెలిపారు.

తోపుడు బండి అందజేసిన 'మండవ'

విశాలాంధ్ర-ఒంగోలు : సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒంగోలు కర్నూలు రోడ్ కి చెందిన క్యాన్సర్ పేషెంట్ శెట్టి ప్రమీల జీవనోపాధి నిమిత్తం మండవ నటరాజ్ ఆర్థిక సహకారం తో సమకూర్చిన పండ్ల తోపుడు బండిని సూర్య శ్రీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మండవ మురళీకృష్ణ అందించారు.ఈ సందర్భంగా మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ వైద్య, వైద్యం, జీవనోపాధి నిమిత్తం కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ సలహాదారుడు మండవ సుబ్బారావు, ట్రస్ట్ కార్యదర్శి షేక్ సర్దార్ భాష తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సీఐ భీమా నాయక్

విశాలాంధ్ర-పామూరు రూరల్ : భారత్ పాకిస్తాన్ యుద్ధ వాతావరణం వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ భీమా నాయక్ అన్నారు . ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ మరియు డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆదేశాలు మేరకు వాహనాలను, లాడ్జిలను, బస్టాండ్ ప్రాంతాలలో క్షుణ్ణంగా పరిశీలించడం జరిగినది. అనుమానితులు అపరిచిత ను గుర్తించినట్లయితే మాకు సమాచారం ఇవ్వాలని సీఐ భీమా నాయక్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐటి కిషోర్ బాబు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో 'అన్నా'

విశాలాంధ్ర-గిద్దలూరు: స్థానిక శ్రీ వాసవి కల్యాణ మండపం నందు సీనియర్ జర్నలిస్ట్ సురే కృష్ణారావు,అంజనమ్మల కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరు అయి నూతన వధూవరులు అయిన సాయి మేఘన, సాయినాథ్‌లను ఆశీర్వదించిన గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర వికాసం

ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎంవీఎస్ పార్వతి

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని చట్టుమడుగు గ్రామంలో అంగనవాడి కేంద్రం నందు" కిశోరి వికాసం" కార్యక్రమంలో భాగంగా "పునరుత్పత్తి ఆరోగ్యం - బాల్యవివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు" అంశంపై ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం. వి .ఎస్. పార్వతి ఆధ్వర్యంలో కిషోర్ బాలికలు, మహిళలకు అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగినది. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ బాల్యవివాహాలకు దానివల్ల కలిగే దుష్ఫలితాలకు కారణం విద్య లేకపోవడం ఒక కారణమని, వీరిలో శారీరక, మానసిక అభివృద్ధి చెందకపోవడం వల్ల చిన్న వయసులో గర్భం దాల్చడం, ప్రసవ సమయంలోనే శిశువు మరణించడం లేదా అనారోగ్యంతో జన్మించడం, నెలలు నిండకముందే జన్మించడం, తక్కువ బరువు తోపుట్టడం, గర్భస్రావాలు జరగడం, గృహహింస అధికమని, అవకాశాలకు స్వేచ్ఛ తగ్గిపోవడం, వ్యక్తిగతంగా, సామాజికపరంగా నష్టాన్ని కలిగిస్తాయని వివరించిరి. ఎమ్మెన్ కే సరోజినీ బాల్యవివాహాల నిషేధ చట్టం 2016 ప్రకారం బాలికలకు 18 సంవత్సరాల లోపు వివాహం చేయడం నేరమని, అలా చేస్తే రెండు సంవత్సరముల జైలు శిక్ష లక్ష జరిమానా విధిస్తారని అన్నారు. తదుపరి బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి. శా రమ్య, అంగన్వాడీ కార్యకర్తలు ఎస్. విజయ్ కుమారి, కె . ఎలిజబెత్తమ్మ, పి .లక్ష్మీప్రసన్న, షేక్ ఖాజాబీ, షేక్ రజియా బేగం, కిషోర్ బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ అధికారి సమావేశం

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి మండలం తహసీల్దార్ వారి కార్యాలయం నందు శుక్రవారం సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల తాసీల్దార్లు మరియు వివిధ రాజకీయ పార్టీ నాయకులతో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వర కుమార్ సమావేశం నిర్వహించారు. సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఆధార్ సీడింగ్, నూతన ఓటర్ల నమోదు, తొలగింపులు, సవరణ గురించి అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో చర్చించారు. అన్ని రాజకీయ పార్టీల బి.ఎల్.ఏ.లు సంబంధిత పోలింగ్ స్టేషన్ బి.ఎల్.ఓ.సహకరించి ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు సహకరించాలని మరియు సూచనలు సలహాలు ఇవ్వాలని తెలిపారు. చీమకుర్తి మండల తాసిల్దార్ ఆర్.బ్రహ్మయ్య, సంతనూతలపాడు తాసిల్దార్ వి.ఆదిలక్ష్మి, మద్దిపాడు తహసీల్దార్ ఎస్.ఎల్.నారాయణ రెడ్డి, నాగులుప్పలపాడు డిప్యూటీ తాసిల్దార్ వాసుదేవరావు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు గొల్లపూడి సుబ్బారావు, పమిడి వెంకటేశ్వర్లు,వేమా శ్రీనివాసరావు, తాతినేని రాము, దరిమడుగు నాగరాజు,తుమ్మల సుబ్బారావు, పూసపాటి వెంకట్రావు, 4 మండలాల ఆపరేటర్లు పాల్గొన్నారు.

బాలికల బంగారు బాల్యంపై అవగాహన

విశాలాంధ్ర - సింగరాయకొండ : బాలికల బంగారు బాల్యం, కిశోర బాలికలు, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణాపై సింగరాయ కొండ మండల పరిధిలోని స్థానిక ఈద్గామిట్ట పాదీ ఖానా లో కిషోర్ బాలికలపై అవగాహన సదస్సు శుక్రవారం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమమును ఉద్దేశించి ఐసీడీయస్ సూపర్వైజర్ రిజ్వానా మాట్లాడుతూ కిషోర్ బాలికలు ఆరోగ్యం,విద్య, వైద్యం తదితర అంశాల గురించి సవివరంగా మాట్లాడారు. తదుపరి సాంత్వన సేవా సమితి డైరెక్టర్ జయ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలల అక్రమ రవాణా, వెట్టి చాకిరి నుండి పూర్తిగా విముక్తి కలిగించాలని బాలికలకు బంగారు బాల్యం అందించాలని తెలిపారు. గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో చిమట సుధాకర్, సూపర్వైజర్ మసూద్ ఆలీ, సెక్రటరీ సుశీల, చంద్రశేఖర్, సూపర్వైజర్, సైదాబీ, రేణుమల రాజశేఖర్, ఎం రాజారావు మహిళా పోలీస్ సిబ్బంది, మరియు గర్భిణీలు పాల్గొన్నారు.

ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించండి

ఆర్టీసి డీపీటీఓ సత్యనారాయణ

విశాలాంధ్ర-మార్కాపురం : ఆర్టీసి బస్టాండులలో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చే ప్రయాణీకులకు కనీస సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆర్టీసి డిపిటిఓ (ఆర్యంఓ) జి సత్యనారాయణ స్థానిక డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులుకు తెలిపారు. శుక్రవారం మార్కాపురం ఆర్టీసి బస్టాండు, డిపో, కార్గో సర్వీసులను పరిశీలించారు. ప్రయాణీకుల నమ్మకాన్ని కోల్పోకుండా సౌకర్యాలు. కల్పించాలని, నమ్మకాన్ని పెంచు కోవాలని, ప్రయాణీకులతో గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. బస్టాండుల్లో తినుబండారాలను అధికధరలకు విక్రయిస్తేచర్యలు తీసుకోవాలని అన్నారు. బాత్రూమ్ము ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని తెలిపారు.. కార్గో ఆదాయంపై దృష్టిసారించాలని కార్గోద్వారా అందిస్తున్న సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. అనంతరం గ్యారేజీకి వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించి కండీషన్లో బస్సులను బయటకు పంపాలని చెప్పారు. డీజిల్ ఆదా చేయడం, ప్రయాణీకులను ఎక్కించుకునే విషయంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్టీసిపై ఉన్న నమ్మకాన్ని పెంచాలని తెలిపారు.

దేశానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే చర్యలు తప్పవు : సీఐ అస్సాన్

విశాలాంధ్ర-త్రిపురాంతకం : భారత దేశానికి వ్యతిరేకంగా, దేశ సమగ్రతను దెబ్బ తీసే విధంగా ఎవరైనా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన, వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని త్రిపురాంతకం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి అస్సాన్ తెలిపారు. ఇటీవల గొల్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పాకిస్తాన్ కు అనుకూలంగా, భారత దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందన్నారు."తొందరపాటు చర్యల వలన యువకులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆయన హెచ్చరించారు". దేశ రక్షణ భద్రతలో భాగంగా యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా సర్కిల్ పరిధిలోని ఎక్కడైనా అనుమానిత వ్యక్తులు ఎవరైనా సంచారిస్తున్నట్లు కనిపిస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో తెలియజేయా లన్నారు.

ప్రజా దర్బార్‌కు 80 అర్జీలు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజా దర్బార్‌కు వివిధ వర్గాల ప్రజల నుండి 80 అర్జీలు దాఖలు అయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ సమస్యలకు సంబంధించి విచ్చేసిన ప్రజల నుండి సమస్యలను తెలుసుకొని వారి నుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉచిత చలివేంద్రాలు ఏర్పాటు

విశాలాంధ్ర-చీమకుర్తి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చీమకుర్తి పురపాలక సంఘంలో వేసవికాలంలో ప్రజల సౌకర్యార్థం పురపాలక సంఘం ఆధ్వర్యంలో మెయిన్ రోడ్ ఓల్డ్ బీసీ హాస్టల్ వద్ద మరియు మసీద్ సెంటర్ వద్ద ఉచిత చల్లటి త్రాగునీరు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ వై. రామకృష్ణ తెలిపారు. చలివేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు బాపట్ల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మన్నం ప్రసాదు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కాట్రగడ్డ రమణయ్య, చీమకుర్తి మున్సిపల్ మాజీ వైస్ ప్రెసిడెంట్ గంగాధర్, గొల్లపూడి కోటేశ్వరరావు, మున్సిపల్ ఏ.ఈ., మేనేజర్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

విశాలాంధ్ర-సంతనూతలపాడు: స్థానిక పోలీస్ స్టేషన్ నందు కర్నూల్ రోడ్డుపై ముమ్మరముగా వాహనాలను తనిఖీలు చేపట్టారు. ప్రకాశం జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్ బాబు ఆధ్వర్యంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా అనుమానాస్పదమైన వ్యక్తుల కొరకు వస్తువుల కొరకు ఏదైనా మందు గుండు సామాగ్రి తరలిస్తున్న సమాచారం మేరకు ముందస్తుగా వాహనాలను వ్యక్తులను వారు తీసుకున్న వెళుతున్న బ్యాగులను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీసులు ఉన్నారు.

అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం

మున్సిపల్ చైర్మన్ జంజనం

విశాలాంధ్ర - చీరాల : అవిశ్వాసం విషయమై తెలుగుదేశం పార్టీ అధిష్టానం నిర్ణయమే శిరోధార్యం అని చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే నెల 14వ తేదీన అవిశ్వాసంపై సమావేశానికి కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. కలెక్టర్‌ను కలిసి కౌన్సిలర్లు ఇచ్చిన నోటీసులో తనపై అవినీతి ఆరోపణలు చేశారని, ఈ విషయమై ఎటువంటి విచారణకైనా సిద్ధమే అన్నారు. తాను రాజకీయాల్లో స్వర్గీయ రోశయ్య హయం నుండి కొనసాగుతున్నానని, చీరాల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తరపున శాసన సభ్యునిగా పోటీ చేసి 47 వేలకు పైగా ఓట్లు సాధించి, నియోజకవర్గ ఇంఛార్జిగా పని చేశానన్నారు. మాజీ శాసన సభ్యులు ఆమంచి కృష్ణమోహన్ చేనేత వర్గాన్ని ఏనాడు ప్రోత్సహించ లేదని, మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వలేదన్నారు. అవకాశవాద రాజకీయాలతో ఇప్పుడు తన వర్గం కౌన్సిలర్లతో అవిశ్వాసం పెట్టారన్నారు. తాను తెలుగుదేశం పార్టీలో ఇంకా సభ్యత్వం తీసుకోలేదని, ఒకేసారి వైకాపాకు రాజీనామా చేసి సభ్యత్వం తీసు కుంటానన్నారు. అవిశ్వాసంలో ఏమి జరిగినప్పటికీ తెలుగుదేశం పార్టీతో కలిసి తనకు అప్పచెప్పిన బాధ్యతలు నిర్వర్తిస్తానన్నారు. చీరాల నియోజకవర్గ శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య, ఎంపీ కృష్ణప్రసాద్ లతో సత్సంబంధాలు ఉన్నాయన్నారు. తనకు మున్సిపల్ చైర్మన్‌గా అవకాశం ఇచ్చిన మాజీ శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి, కరణం వెంకటేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు మేడా వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్ విజయవంతంపై హర్షం

విశాలాంధ్ర - చీరాలరూరల్ : పెహల్గాం ప్రాంతంలో అమాయకులైన పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని మతప్రాతిపదికన ప్రాణాలు తీసిన ఉగ్ర దాడికి ప్రతీకార చర్యగా భారత సైన్యం జరిపిన ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా చీరాల భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, నాయకులు గడియార స్తంభం కూడలి వద్ద బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాజపా చీరాల పట్టణ అధ్యక్షురాలు గుద్దంటి భవాని మాట్లాడుతూ మహిళల పసుపు కుంకుమలు చెరిపేసిన తీవ్రవాదులను సింధూర్ పేరుతో ఆపరేషన్ నిర్వహించి పాకిస్తాన్ ఉగ్రవాదుల మీద దాడి చేసిన భారత మహిళా సైనికులకు అభినందనలు తెలిపారు. ఉగ్రవాదుల్నే లక్ష్యంగా చేసుకుని సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా భారత సైన్యం సత్తా చాటుతుంది అని, జయహో భారత్ అన్నారు. ఈ కార్యక్రమంలో బందారుపల్లి హేమంత్ కుమార్, శంకర్ శెట్టి నాగేశ్వరావు, వేముల వెంకటేష్, మేడికొండ భరణి రావు, సుజాత, అర్వపల్లి కుమార్, అధిక సంఖ్యలో భాజపా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందరికీ అంకితం

కలెక్టర్ జె.వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదుపై నాకు వచ్చిన అవార్డు, బంగారు పతకాన్ని ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, రెడ్ క్రాస్ సంస్థకు అంకితం చేస్తున్నానని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ప్రకటించారు. ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అవార్డు, బంగారు పతకం అందుకోవడం చాలా సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని అధికారులు, సిబ్బంది, రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధుల సమష్టి కృషితోనే బాపట్లకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. వారంతా క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేయడంతోనే రెడ్ క్రాస్ సంస్థ ద్వారా ప్రజలకు విశేష సేవలందాయన్నారు. ముఖ్యంగా కృష్ణానది వరద విపత్తు సమయంలో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, రెడ్ క్రాస్ సంస్థ అందించిన సేవలు మరువలేవన్నారు. రెడ్ క్రాస్ సంస్థ సేవలు ఇక్కడ విస్తృతమయ్యాయని, సభ్యత్వ నమోదులోనూ బాపట్ల జిల్లా రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేశారన్నారు. అందరి కృషితోనే ఈ అవార్డు, బంగారు పతకం అందుకున్నానని, అందుకే వారికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

టిప్పరు ఢీకొని ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి

విశాలాంధ్ర-సంతనూతలపాడు : సంతనూతలపాడు లోని మైనంపాడు డొంక చెరువు కట్ట సమీపంలో శుక్రవారం టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో స్కూటీపై వస్తున్న చీమకుర్తి ఎక్సైజ్ కానిస్టేబుల్ పోతిరెడ్డి వెంకటరామిరెడ్డి 51 మృతి చెందాడు. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ రామిరెడ్డి కాలు తెగి రహదారిపై పడింది దీనికి తోడు నడుము పూర్తిగా దెబ్బ తినటం జరిగింది ఒంగోలు కర్నూల్ జాతీయ రహదారి రక్తసిక్తమైంది. ఘటనా స్థలం చూపరులకు ఒళ్లుగగుర్పాటు కలిగించేలా ఉంది. రెండుగా చెల్లా చెదురైన కానిస్టేబుల్ రామిరెడ్డి మృతదేహాన్ని అంబులెన్సులో ఎక్కించడానికి ఎవరు సాహసం చేయకపోవడంతో సంతనూతలపాడు సబ్ ఇన్స్పెక్టర్ వేజెండ్ల అజయ్ బాబు, హోమ్ గార్డ్ నాయక్ ఉదాసినత చాటుకున్నారు.అంబులెన్సు సిబ్బంది సాయంతో అంబులెన్సులో ఒంగోలు రిమ్స్ నకు తరలించే ప్రయత్నం చేయగా మార్గ మధ్యంలోనే కానిస్టేబుల్ రామిరెడ్డి మరణించాడు. ప్రమాదం జరిగిన వెంటనే రోడ్డు మీద వాహనాలు నిలిచి పోవడంతో గందరగోళం నెలకొంది. చీమకుర్తిలో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో ఎక్సయిజ్ కానిస్టేబుల్‌గా రామిరెడ్డి పనిచేస్తున్నారు. ప్రకాశం జిల్లా రాచర్ల మండలం ఆకువీడు గ్రామం పోతిరెడ్డి వెంకటరామిరెడ్డి స్వగ్రామం. రామిరెడ్డి తన స్కూటీపై చీమకుర్తి నుండి ఒంగోలుకు వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించినది. ప్రమాదం రూపంలో మృత్యువు కానిస్టేబుల్ రామిరెడ్డి ని బలిగొంది. ఎక్సైజ్ కానిస్టేబుల్ రామిరెడ్డి తన స్కూటీపై ఒంగోలు వెళ్తూ ఈ ప్రాంతానికి చేరుకునేసరికి వెనుకగా చీమకుర్తి నుండి ఒంగోలుకు మట్టిలోడుతో వెళ్తున్న టిప్పర్ బలంగా ఇతన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎక్సయిజ్ కానిస్టేబుల్ దుర్మరణం పాలయ్యారు. వేగంగా వచ్చిన లారీ వెనక నుంచి ఢీ కొట్టడంతో శబ్దం వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. కర్నూల్ జాతీయ రహదారి పై ప్రమాదం చోటు చేసుకున్న సమాచారం అం దుకున్న ఎస్సై అజయ్ బాబు, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి కర్నూల్ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయివడంతో ట్రాఫిక్ అంతరాయాన్ని తొలగించారు. మృతి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ రామిరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు కలరు. చీమకుర్తి ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.సుకన్య, ఎక్సైజ్ సిబ్బంది ప్రమాద సంఘటనను పరిశీలించారు. తమతో డ్యూటీ చేసి ఒంగోలు వెళు న్న కానిస్టేబుల్ రామిరెడ్డి ఈ ప్రమాదంలో మృతి చెందడంతో చీమకుర్తి ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఒక్కసారిగా దుఃఖ సాగరంలోకి మునిగిపోయారు. సంతనూతలపాడు సబ్ ఇన్స్పెక్టర్ వేజెండ్ల అజయ్ బాబు దీనిపై కేసు నమోదు చేశారు.

బాల్య వివాహాలతో బాలికల భవిష్యత్తు అంధకారం

విశాలాంధ్ర - మార్టూరు : బాల్యవివాహాలతో బాలికల భవిష్యత్తు అంధకారమని ఐసిడిఎస్ సూపర్వైజర్ శిరీష అన్నారు. బాల్య వివాహాలు బాలికల శారీరక, మానసిక, సామాజిక ఎదుగుదలను అడ్డుకుంటాయని వాటి నివారణ సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మార్టూరులోని సచివాలయం ఒకటిలో శుక్రవారం నిర్వహించిన కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆమె స్థానిక బాలికలు మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె బాల్య వివాహాల వలన మహిళలలో ఎదురయ్యే పునరుత్పత్తి, అనారోగ్య సమస్యలు, సాంఘిక, సామాజిక సమస్యల గురించి వారికి అవగాహన కల్పించారు. నిర్దిష్ట వయస్సు వచ్చేవరకు వివాహం చేసుకోబోమని బాలికల చేత, తమ పిల్లలకు బాల్యవివాహాలు జరిపించబోమని తల్లుల చేత శిరీష ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలోఏ. ఎన్.ఎంలు,కె. ప్రమీల రాణి, జి.శారద, మహిళా సంరక్షకురాలుఏ. మాధురి, అంగన్వాడీ కార్యకర్తలు పి. వి. సుశీల,జె. దయమ్మ, రాజ్యం, పి.నాగజ్యోతి, అరుణ కుమారి పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు భారీగా అర్జీలు

విశాలాంధ్ర - చీరాలరూరల్ : చీరాల ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని చీరాల నియోజకవర్గ శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను నేరుగా కలుసుకుని, వారి సమస్యలను స్వయంగా విని, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేసేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. చీరాల నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించే దిశగా పని చేస్తామన్నారు. బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు పని చేయాలని సూచించారు. ప్రజాదర్బార్ లో చీరాల నియోజకవర్గ ప్రజల నుండి స్వయంగా అర్జీలను స్వీకరించారు. రానున్న రోజుల్లో చీరాల నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ప్రజా దర్బార్ లో భారీగా 750 అర్జీలు రాగా వాటిలో పెన్షన్ కు 100 అర్జీలు, ఇళ్ల స్థలాలకు 630 అర్జీలు, ఇతర సమస్యలతో 20 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్, తెలుగుదేశం, భాజపా, జనసేన, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి మొదటి విడత కౌన్సెలింగ్ కింద ఎలక్ట్రిషన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, కోప ట్రేడుల నందు ఉన్న ఖాళీలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.సుధాకర బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 24 వ తేదీ లోపు ఈ.ఖ.ఖజా.ప్రకీ.అఅ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని అలాగే ఈ నెల 24 నుండి 26 వ తేదీ లోగా అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ వెరిఫికేషన్ చేసుకున్న ప్రింట్ కాపీతో పాటు విద్యార్హతల అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ అలాగే వాటి రెండు సెట్లు జిరాక్స్ కాపీలు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో మెరిట్ ఆధారంగా జూన్ 2 నుండి 10 వ తేదీ వరకు నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జరిగే కౌన్సిలింగ్ కు అభ్యర్థులు హాజరుకావాలని చెప్పారు.పూర్తి వివరాలకు సెల్ : 9849479524 కు లేదా నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని అయన తెలిపారు.

నూతన విద్యుత్ ఉపకేంద్రం స్థల పత్రాల పరిశీలన

విశాలాంధ్ర - సంతమాగులూరు : సంతమాగులూరు మండలం ఏల్చూరులో నూతన 130కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి స్థల సేకరణ పనులు ఊపందుకున్నాయి. అందులో భాగంగానే ట్రాన్స్ కో, ఒంగోలు డీఈ కృష్ణారెడ్డి శుక్రవారం సంతమాగులూరు వచ్చారు. ఈసందర్భంగా విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం కోసం సేకరించిన భూముల వివరాలను డీటీ రాఘవరావును అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన ధ్రువపత్రాల నకళ్లను తీసుకున్నారు. అక్కడి నుంచి ఏల్చూరుకు వచ్చారు. మండల టీడీపీ నేత దుద్దేల చిన గాలెయ్య కలిసి పెండింగ్ లో ఉన్న డాక్యుమెంట్ల గురించి చర్చించారు. భూ యజమానులతో మాట్లాడి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట విద్యుత్ శాఖ ఒంగోలు, సంతమాగులూరు ఏఈలు రత్నం, దీపక్ రెడ్డి, వీఆర్ఏ దేవయ్య పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరికలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : నియోజకవర్గ శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య, చీరాల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్, తెదేపా యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్‌ల సమక్షంలో తెలుగు దేశం పార్టీలోకి భారీ చేరికలు జరుగుతున్నాయి. చీరాల మున్సిపాలిటీ 20,21,22 వార్డు ల నుండి వైకాపాకు చెందిన 200 కుటుంబాల వారు, వాడ రేవుకు చెందిన 300 మంది తెలుగు దేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి శాసన సభ్యులు మద్దులూరి మాల కొండయ్య పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీ లోకి ఆహ్వానించారు.

రెండు గ్రామాల్లో విద్యుత్తుకు అంతరాయం

విశాలాంధ్ర - బల్లికురవ : మండలంలోని గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. శుక్రవారం సాయంత్రం వరకు ముక్తేశ్వరం సూరేపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ రెండు గ్రామాలకు 24 గంటల పాటు విద్యుత్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కనీసం పశువులకు నీళ్లు లేక చేతి పంపులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానికులు పేర్కొన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సొంత నియోజకవర్గంలోనే పరిస్థితి ఇలా ఉందని కొందరి కూటమి నాయకులు బహిరంగంగానే చర్చించుకున్నారు. శుక్రవారం సాయంత్రానికి కూలిపోయిన విద్యుత్ స్తంభాలకు వైర్లు తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఘనంగా మొగదారమ్మతల్లి జల క్రీడలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం గ్రామ దేవత, మత్స్యకారుల ఇలవేల్పు శ్రీ మొగదారమ్మ తల్లి శిడిమాను మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం జల క్రీడలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ మొగదారమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తప్పెట్లు, మేళతాళాలతో రంగురంగుల తోరణాలతో వాహనాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపుగా బయలుదేరారు.యువకులు కేరింతలు కొడుతూ ఎంతో ఉత్సాహంగా జల క్రీడలను నిర్వహించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిజాంపట్నం ఎస్ఐ కె.తిరుపతిరావు పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర - మార్టూరు : జాతీయ రహదారిపై కారులో వెళుతున్న వ్యక్తిని టిప్పర్ ఢీకొన్న ప్రమాదంలో కారులోని వ్యక్తి గాయపడిన సంఘటన శుక్రవారం ఉదయం మార్టూరు సమీపంలో జరిగింది. హైవే అంబులెన్స్ సిబ్బంది వివరాలు ఇ లా ఉన్నాయి. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన బండారు వెంకటేశ్వరరావు చిలకలూరిపేట నుండి జొన్న తాళి వైపు తన ఇండికా విస్టా కారులో వెళుతున్నాడు. అదే మార్గంలో వెళ్తున్న టిప్పర్ వెంకటేశ్వరరావు కారును పక్కనుండి ఢీకొట్టడంతో కారు రోడ్డు పక్కన గల మార్జిన్‌లోని డివైడర్ ఎక్కింది. ప్రమాదంలో వెంకటేశ్వరరావు గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న హైవే అంబులెన్స్ సిబ్బంది గాయపడిన వెంకటేశ్వరరావును ద్విచక్ర వాహనంపై మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం ట్రాఫిక్ అవరోధాలు తొలగించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు.

బాల్యవివాహాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - వేమూరు : బాల్య వివాహాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని వివాహ వయస్సు వచ్చేంతవరకు వేచి ఉండాలని అంగన్వాడి అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ రాణి తెలిపారు .శుక్రవారం వేమూరులో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసుకుంటే అనారోగ్యాలకు గురవుతారని తెలియజేశారు. ఈ సందర్భంగా బాలికలకు వీడియో ద్వారా అవగాహన కల్పించారు, ఏఎన్ఎం జయమణి మాట్లాడుతూ కౌమార దశలో బాలికలు తగు జాగ్రత్తలు తీసుకొని పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ అమృతవాణి, అంగన్వాడి కార్యకర్తలు మాధవి, రాజకుమారి, రాజ్యలక్ష్మి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రీ మృతి

విశాలాంధ్ర - చీరాల : జాతీయ రహదారి 216పై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు చీరాల విఠల్‌నగర్‌కు చెందిన కుంచాల సురేష్ (35) తాపిమేస్త్రిగా పనిచేస్తూ, పని నిమిత్తం చీరాల నుంచి కఠారిపాలెం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో. మన్నం అపార్ట్‌మెంట్ వద్ద వేగంగా వస్తున్న లారీ అతని వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో సురేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యం అందిస్తుండగానే సురేష్ మరణించాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడి మృతితో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

హారిజన్ పబ్లిక్ స్కూల్ ప్రారంభం

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని రామన్నపేట పంచాయితీ సాయినగర్ లో శుక్రవారం మాజీ సిబిఐ డైరెక్టర్ జెడి లక్ష్మీనారాయణ, చీరాల శాసనసభ్యులు మద్దూరి మాలకొండయ్య చేతుల మీదుగా అత్యంత వైభవంగా హొరిజోన్ పబ్లిక్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త, పాఠశాల సెక్రెటరీ కరెస్పాండెంట్ డాక్టర్ పొగడదండ రవికుమార్ మాట్లాడుతూ అత్యుత్తమ విద్య అందించేందుకు హొరిజోన్ పబ్లిక్ స్కూల్ ప్రారంభిస్తున్నామన్నారు. వేటపాలెం కొత్త కాలువ ఆర్ అండ్ బి రహదారిలోని బ్రిడ్జి ప్రక్కన వినాయక స్వామి గుడి ఎదురుగా సాయినగర్ నందు ప్రశాంతమైన వాతావరణంలో ఆహ్లాదకరమైన మామిడి తోటల్లో విద్యార్థులను ఆకట్టుకునేలా నూతనంగా నిర్మించిన తరగతి గదులతో పలువురు డాక్టరేట్లు పొందిన ప్రొఫెసర్ల సమక్షంలో అత్యున్నత విద్యాబోధన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాండ్రపేట ఇస్కాన్ మందిర్ వ్యవస్థాపకులు కే. శివశంకరరావు, సులోచన, చీరాల తెలుగుదేశం నియోజకవర్గ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్, స్కూల్ ప్రెసిడెంట్ డాక్టర్ పి.హరిణి, మేనేజింగ్ డైరెక్టర్ పి. హర్షి, పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లిలో పర్యటించిన మంత్రి గొట్టిపాటి

విశాలాంధ్ర - సంతమాగులూరు : సంతమాగులూరు మండలం కామేపల్లిలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం పర్యటించారు. తొలుత గ్రామానికి చెందిన కురిచేటి విశ్వరూపాచారి కుమారుడు రాజగోపాలాచారి, వెంకట భాగ్యలక్ష్మి వివాహ వేడుకలకు మంత్రి హాజరయ్యారు. ఈసందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అక్కడి నుంచి అదే గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందిన జాస్తి హనుమంతరావు నివాసానికి వెళ్లారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. హనుమంతరావు కుటుంబాన్ని ఆదుకుంటామని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈకార్యక్రమంలో సంతమాగులూరు ఏఎంసీ ఛైర్మన్ తేలప్రోలు రమేష్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, పుట్టావారిపాలెం సర్పంచ్ సన్నెబోయిన గురుయాదవ్, మండల టీడీపీ నేతలు చేవూరి వాసురెడ్డి, అట్ల పెద్ద వెంకటరెడ్డి, స్థానిక నేతలు గమిడి కోటేశ్వరరావు, గుండపనేని సురేష్, సుబ్బారావు, గాడిపర్తి రాంబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు కమిషనర్ అభినందనలు

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళికి రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదులో ప్రతిభ చూపి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదగాఅవార్డు, బంగారు పతకాన్ని అందుకున్నారు. ఈ నేపధ్యంలో బాపట్ల మున్సిపల్ కమీషనర్ జె.రఘునాధ్‌రెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్‌ను మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు.

కలెక్టర్‌కు తహసీల్దార్ సలీమా అభినందనలు

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళికి రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదులో ప్రతిభ చూపి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ చేతుల మీదగాఅవార్డు, బంగారు పతకాన్ని అందుకున్నారు. ఈ నేపధ్యంలో బాపట్ల తహశీల్దారు షేక్ సలీమా కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్‌ను మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు.

వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల పంపిణీ

విశాలాంధ్ర - చెరుకుపల్లి : రేపల్లె నియోజకవర్గంలోని రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందజేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి టి బాలాజీ గంగాధర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ మరియు స్టాంప్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు పరికరాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమంలో రైతు సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వీర సైనికులకు సంఘీభావ ర్యాలీ

విశాలాంధ్ర - అద్దంకి : ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్కు ఆపరేషన్ సింధూర్ ద్వారా దీటైన జవాబు ఇస్తున్న భారత వీర సైనికులకు సంఘీభావం తెలుపుతూ పట్టణ సాంస్కృతిక సేవ కళా రంగాలకు చెందిన ప్రముఖులు శుక్రవారం అద్దంకి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దేశ రక్షణ కోసం ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు దేశమంతటా ఒకే తాటిపై నిలిచి మద్దతు తెలపాలన్నారు.

ఐపీఎస్ ఉదయకృష్ణారెడ్డికి ఘన స్వాగతం

విశాలాంధ్ర - సింగరాయకొండ : ఐపిఎస్ సాధించిన మూలగాని ఉదయ కృష్ణారెడ్డికి సొంత ప్రాంత ప్రజలు ఉన్నతాధికారులు సింగరాయకొండ మండలంలో శుక్రవారం ఘనంగా స్వాగతం పలికారు. అవమానం జరిగిన చోటే తన సత్తా చాటి చెప్పిన సాధారణ పోలీస్ కానిస్టేబుల్ సివిల్స్‌లో ఎంపికయి ఐపిఎస్ కొట్టడంతో ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం ఊళ్ల పాలెం గ్రామ పౌరులు తమ బిడ్డ మూలగానికి ఘనంగా పౌర స్వాగతం పలికారు. తీర ప్రాంతంలో అరకొర చదువులు అందే ప్రాంతంలో జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో తన సత్తా చాటాడు. మూలగాని ఉదయ కృష్ణా రెడ్డి. ప్రజలకు తనవంతు సేవలు అందించాలనిన లక్ష్యంతో చిన్న పోలీస్ కానిస్టేబుల్ గా ఎంపికయి సమాజానికి సేవలు అందిస్తున్న ఉదయ కృష్ణా రెడ్డికి తన పోలీస్ ఉన్నత అధికారుల నుండి వేధింపులు, ఎగతాళి అవమానం మానసికంగా కుంగా తీశాయి. దానితో కసి పెంచుకున్న ఉదయ కృష్ణా రెడ్డి నూరు ఆరయినా అవమానం పొందిన దగ్గరే సత్తా చాటాలని గ్రామం నుండి పట్టణ బాట పట్టారు. నిరంతరం కఠోర శ్రమ సాధన చేసి తన సత్తా చాటి సివిల్స్ పరీక్షలో ఐ పీఎస్ సాధించడం గ్రామ ప్రజలతో పాటు ఉదయ కృష్ణా రెడ్డి పట్టలేని ఆనందంతో సింగరాయకొండ నుండి ఊళ్ల పాలెం వరకు పౌర ర్యాలీలో పాల్గొన్నారు. తమ గ్రామ యువకుడు ఐ పి ఎస్ కి ఎంపిక కావడంతో ఊళ్ల పాలెం, బంగిన పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలు తారతమ్యం లేకుండా పండుగ చేసుకున్నారు. దీక్ష పట్టుదల కసి నిబ్బరం ఉంటే ఉన్నత స్థాయికి వెళ్ళవచ్చని ఉదయ కృష్ణారెడ్డి నిరూపించడం స్థానిక ప్రజలు ఆయన బంధువులు, స్నేహితులు పేర్కొన్నారు. సంపాదన అంటే డబ్బు కాదు చదువు అని ప్రతి ఒక్కరు గుర్తించి ఉదయ కృష్ణారెడ్డిని ఆదర్శంగా తీసుకుని పిల్లలని బాగా చదివించాలని, పిల్లకూడ ఉన్నత స్థాయికి ఎదగడానికి చదువుల పట్ల ఆసక్తి పెంచుకోవాలని తల్లిదండ్రులు, పెద్దలు పిలుపు ఇచ్చారు. మార్గ మధ్యంలో సింగరాయకొండ ప్రజలు అడుగడుగునా పూలమాలతో సత్కరించి అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పోలీసు ఉన్నతాధికారులు మండలంలోని ప్రజలు అభిమానులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ రేపల్లె సమితి నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

విశాలాంధ్ర - రేపల్లె : ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటియుసి) రేపల్లె ఏరియా సమితి నూతన కార్యవర్గ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎఐటియుసి రేపల్లె ఏరియా గౌరవ అధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం స్థానిక ఏఐటియుసి కార్యాలయంలో జరిగిన ఎఐటియుసి సమావేశంలో 21 మందితో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన చెప్పారు. ఎఐటియుసి రేపల్లె ఏరియా సమితి నూతన అధ్యక్షులుగా గొట్టుముక్కల శ్రీమన్నారాయణ, ప్రధాన కార్యదర్శిగా పి.నాగాంజనేయులు, ఉపాధ్యక్షులుగా సమ్మెట శ్రీనివాసరావు, యార్లగడ్డ కనకదుర్గ, బి. కుసుమ కుమారి, కార్యదర్శులుగా గుమ్మడి నాగ మల్లేశ్వరమ్మ, కొలుసు నరేష్, కాగిత శ్రీనివాసరావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా గాలి ఏసుదాసు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా సిరంశెట్టి శ్రీనివాసరావు, వర్కింగ్ ఉమెన్ కార్యదర్శిగా క్రాప జయమ్మ, కోశాధికారిగా పరుచూరి పద్మావతి లతో పాటు మరో తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారని బాలాజీ తెలిపారు.

బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవు

విశాలాంధ్ర - రేపల్లె : బాల్య వివాహాల వలన ఆరోగ్య ప్రమాణాలు పూర్తిగా పాడైపోతాయని బాల్య వివాహాలను ఎవరైనా ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిడిపిఓ ఎం సుచిత్ర అన్నారు. బాపట్ల జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో రేపల్లె ఐసీడీస్ ప్రాజెక్ట్ పరిధిలోని రేపల్లె మండలం, నగరం మండలం మరియు రేపల్లె మున్సిపాలిటీ ల నందు శుక్రవారం కిషోరి వికాసం సమ్మర్ కాంపెయిన్‌ను జరిగింది. కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు, ఆరోగ్య ప్రభావాలకు సంబంధించిన ఈ వీడియోలు కిషోర బాలికలందరికీ చూపించి బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు గురించి వివరించారు. తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా 3-6 ఏళ్ల పిల్లలతో ఆదివారం మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని తల్లి ఇష్టాల గురుంచి పిల్లలతో చెప్పించి వారికి విషెస్ చెప్పి పాదాభివందనాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఎం సుచిత్ర,ఆర్ సాయి ప్రియదర్శిని, మహిళసంరక్ష కార్యదర్శి సి హెచ్ నాగేంద్రం, ఏఎన్ఎం,ఆషా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు,కిషోరి బాలికలు, తల్లుల్లు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : వేసవిలో గ్రామాలలో తాగునీటిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇన్చార్జి ఎంపీడీవో లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రజని అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానిలో ముందుగా ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి నివాళులర్పించి, వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, గ్రామాలలో వేసవి ఉష్ణోగ్రతలు, అధికంగా ఉన్నందున ప్రజలకు నీటి కొరత లేకుండా చూడాలని, పారిశుద్ధ్యం పై ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అధిక ఉష్ణోగ్రతలో ఉన్నందున వైద్యశాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామాల్లో పెండింగ్లో ఉన్న సిసి రోడ్లను త్వరగా పూర్తి చేయాలని, ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరువయ్యేలా చూడాలని అన్నారు.ఎంఈఓ గోపి మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరానికి అన్ని పాఠశాలల విద్యార్థులకు అందించేందుకు పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీవో కృష్ణ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ బ్రహ్మయ్య, ఎంఈఓ సిహెచ్ గోపి, పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్ రావు, సచివాలయ సిబ్బంది నాయకులు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.